
# ఆనంద శంకరం

డా|| వి. చంద్రశేఖరరావు



అందమైన కలలాంటి వాతావరణంలోకి భయం భయంగా అడుగుపెట్టాడు ఆనంద శంకరం. ఫైనలియర్ సోషల్ వర్కు విద్యార్థులకు జూనియర్లుయిస్తున్న ఫేర్‌వెల్ పార్టీ అది.ఆ సాయంకాలం యూనివర్సిటీ కాంపస్ గొప్ప రొమాంటిక్ సౌందర్యంతో వెలిగిపోతుంది. సాయంకాలపు నిశ్శబ్దంలో గలగలా ప్రవహిస్తున్న బిస్మిల్లా ఖాన్ షెహనాయి.

వృక్ష కన్యల పొడవాటి కురుల కొమ్మలపై మిలమిలలాడే రంగు దీపాలు. వలయంలా పేర్చిన కుర్చీలు. ఎదురుగా చిన్న వేదిక. లాన్ మధ్యలో చిన్న చిన్న సమూహాలుగా చీలి కబుర్లు చెప్పకుంటున్న విద్యార్థులు. ఎ ఫెస్టివల్ ఆఫ్ లైఫ్. ఆ కార్యక్రమానికి రావటం బొత్తిగా యిష్టం లేదు ఆనందశంకరానికి. పార్టీకి రాకపోతే ఇంటర్నల్ ఎసెస్‌మెంటు మార్కులన్నీ కోసేస్తానని బెదిరించాడు వాళ్ళ ప్రొఫెసరు గంగాధరుడు. తప్పనిసరిగా, అయిష్టంగా, అసౌకర్యంగా అక్కడికొచ్చాడు ఆనందశంకరం.

ఆనంద శంకరం తీరే అంత!

జీవితంలో ఎదురయ్యే మార్పులంటే భయం. ఇవ్వాల్టినుండి రేపటిలోకి ప్రయాణించటమంటే భయం. అమ్మఒడి, తండ్రి మురిపెం, బంధుమిత్రుల బుజ్జగింపులు, అద్భుతమైన నిన్నటి బాల్యమంటే అతినికెంతో యిష్టం. బాల్యం లోంచి ఒక్కతోపు త్రోసినట్లుగా యవ్వన ప్రపంచంలోకి తీసుకురాబడ్డాడు. ఎన్నెన్ని బాధ్యతలు! అన్నిటికన్న దుర్భరమైనది సమూహాల మధ్య మెలగటం. మనుషుల్ని ఎదుర్కోవాలి. వాళ్ళతో స్నేహం చేయాలి! చేయి కలపాలి! హృదయాన్ని విప్పి కబుర్లు అటూ ఇటూ రవాణా చేసి ఆహ్లాద వాతావరణాన్ని నెలకొల్పాలి. ఇవన్నీ ఆనంద శంకరానికి అసాధ్యమైన విషయాలు. తను అనే భద్రతా వలయాన్ని దాటిన వెంటనే వింతైన అసౌకర్యమూ, ఆందోళనా ఫీలవుతాడు.'పిరికిగొడ్డు', 'నస్మంతరిగాడు', వాడా? హు! లాంటి బిరుదులతో యూనివర్సిటీలో పాపులర్ అయిన ఆనంద శంకరం తన జీవితంలోకెల్లా అత్యంత సంఘర్షణాత్మకమైన ఘట్టాన్ని ఎదుర్కొనే హడావుడిలో ఉన్నాడు.

"ఒరేయ్! శంకరం గాడురా!" అసంకల్పితంగానే పెద్దగా అరిచేడు నిరంజనరావు, చుట్టూ ఐదారుగురు మిత్రులు పరివేష్టించి ఉండగా, యూనివర్సిటీ అమ్మాయిల రహస్య ప్రణయాల గురించిన సొల్లు వినిపిస్తుండగా ఆనంద శంకరం అతని కంటపడ్డాడు. అంతకుముందే "వాడొట్టి బెదురుగొడ్డు. మనుషుల్ని చూస్తే ఆమడదూరం పారిపోయే చెవులపిల్లి గాడు. వాడీ పార్టీకి రాడని పదిరూపాయల బెట్," అంటూ పందెం కాసి ఉన్నాడు. "ఈ వెధవ వచ్చాడే! అంటూ లోలోపలే విసుక్కున్నాడు. పైకి మాత్రం " ఒరే ఆనందా! నువ్వీ పార్టీకి రావటం గొప్ప థ్రిల్‌గా ఉందిరా! ఇట్లా నలుగురిలో తిరగటం నేర్చుకుంటేనే పైకి వస్తావురా! ఫో; వెళ్ళి ప్రొఫెసర్‌కి విష్ చేసిరా!" అంటూ భుజం తట్టాడు. యూనివర్సిటీలో ఆనంద శంకరానికున్న 'ఏకైక మిత్రుడు నిరంజనరావే. ఒకే కులం అనే సామాజిక దగ్గరితనం చూపి ఆనందశంకరానికి స్నేహితుడయ్యాడు నిరంజనరావు. నిజానికది స్నేహం కాదు. అవసరాల దోపిడీ. ఇద్దరు కలసి సినిమాకు వెళతారు. టిక్కెట్లు ఆనంద శంకరం తీస్తాడు. అలకాపురిలో చికెన్ బిరియాని తింటారు. ఆనంద శంకరం బిల్లు పే చేస్తాడు. లైబ్రరీలో ఆనంద శంకరం పేరుతో పుస్తకాలు యిష్యూ చెయ్యబడతాయి. అవి నిరంజనరావు నెలల తరబడి ఉంచుకుంటాడు. ఆనంద శంకరం ఫ్యూస్ కడతాడు. ఈ స్నేహం పేరుతో తను నష్టపోతున్నానని తెలిసినా కాదనే ధైర్యం ఆనంద శంకరానికి లేదు.

ప్రొఫెసరుకి విష్ చేసినాక నలువైపులా కలయజూశాడు. తన క్లాస్‌మేట్లు పాతిక మంది. జూనియర్లు మరో పాతిక. స్టాఫ్, పదిమంది. ప్రిన్సిపాల్, రిజిస్ట్రారు, వి.సి. వాళ్ళ తాలుకు మందీ మార్బలం తుళ్ళుతూ, కేరింతలాడుతూ, నవ్వులకెరటాలై గలగ్గలమంటూ, అక్కడా యిక్కడా అంతటా కబుర్ల పావురాలు కువకువలాడుతూ, వింతైన, కోలాహలమైన జీవితోత్సవం నెలకొని ఉందక్కడ. వాళ్ళ మధ్యకు వెళ్ళి ఆ కోలాహలంలో తానూ భాగం కావాలని కోరిక. కానీ భయం. గుండెల్లో బరువుగా ఉన్నట్లు, ఊపిరి అందనట్లు, ఊహు, అతనివల్ల కాలేదు. ఒక మూల అంతగా మనుషులు కనబడని చోటుకు వెళ్ళి ఒంటరిగా, దిష్టిబొమ్మలా నిలబడ్డాడు.

"హలో ఆనంద్! మధ్యాహ్నం లైబ్రరీకి వస్తానని హాత్ యిచ్చావే!" క్లాస్‌మేటు విజయ అతన్ని వెతుక్కుంటూ వచ్చింది. "రాత్రి మామయ్య వాళ్ళు వచ్చారు. వాళ్ళను బస్సెక్కిచ్చి వద్దామని డిపోకెళ్ళాను. అక్కడ అనుకోకుండా లేటయ్యింది" నసుగుతూ చెప్పేడు. సమయానికో అబద్ధం చెప్పేడేగాని, ఆ అబద్ధం విజయ నమ్మిందో లేదో అని శంకగా ఆమెవైపు చూశాడు. విజయ అవన్నీ పట్టించుకొనే మూడ్‌లో లేదు. "ఒక ముఖ్యమైన విషయం గురించి నీ సలహా తీసుకుందామనే నిన్ను రమ్మంది. ఏ కల్మషంలేని ఇన్నొసెంటు బేబీవి. ఏ ప్రెజుడైజు లేకుండా నా సమస్యకు పరిష్కారం చెబుతావని రమ్మన్నాను. మధ్యాహ్నం పన్నెండు దాకా నీకోసం వెయిట్ చేశాను. బాగా డిస్సప్పాయింట్ అయ్యాను."

ఆనంద శంకరం పశ్చాత్తాపంగా చూశాడు. ఆరోజు ఉదయాన్నే ఫోన్‌చేసి పది గంటలకు లైబ్రరీకి రాగలవా అని అడిగింది. సరేనంటూ చెప్పాడే కాని, ఆ మరుక్షణం నుండే గుండెల్లో గుబులు మొదలైంది. లైబ్రరీ అనే యుద్ధ రంగంలో స్టూడెంట్లు, లెక్చరర్లు, అంతమంది మధ్య తను ఫ్రీగా నడవగలడా? అసలింతకీ సంగతేమిటో? ఈవిడకీ, ఈవిడ ప్రియుడు నందగోపాల్‌కీ చెడిందని క్యాంపస్‌లో చెవులు కొరుక్కుంటున్నారు. కొంపదీసి రాయబారం


CHAITANYA

చెయ్యమంటుందేమో? నందగోపాల్ రౌడీ షీటరు. ఈవిణ్ణే లాడ్జింగుల వెంట, బీచ్‌ల వెంట తిప్పినన్నాళ్ళు తిప్పి, ఇప్పుడు జావోరే అనుంటాడు. అమ్రేష్‌పురి ముఖం వాడూ! ఏదయినా అంటే ముఖం పచ్చడి పచ్చడి చేస్తాడు. ఏం కష్టం వచ్చిందిరా తండ్రీ! రానని చెప్పినా బాగుండేది, అని మదన పడ్డాడు. పని ఉన్నట్లు తొమ్మిది గంటలకే హాస్టలు నుండి బయల్దేరి, ఊరికే బజార్లన్నీ తిరిగి, జగదంబలో ఓ నూన్ షో చూసి ఒంటిగంటకు హాస్టల్ బొరియలోకి తిరిగివచ్చాడు. అట్లా మాట తప్పటం, జీవితపు నిజాల నుండి పారిపోవటం అలవాటు చేసుకొన్న ఆనందశంకరం.

ఇప్పుడు విజయతో మాట్లాడాలంటే అసౌకర్యంగా, గిల్టీగా ఉంది ఆనంద శంకరానికి. ముఖం చాటు చేసుకొని, ఆమెను వదిలించుకొని మరోవైపుకు వెళ్ళాడు. అక్కడ నిరంజనరావు నలుగురైదుగురు మిత్రులు పరివేష్టించి ఉండగా సొల్లు కబుర్లేవో చెబుతున్నాడు. "నేరక ఈ సోషల్ వర్క్ తీసుకున్నానురా! కుంటి, మూగ, గుడ్డిశరణాలయాలు, ముసలిముతకల 'నిర్మలహృదయాలు' బ్రతుకంతా ఇదే అయిపోయిందిరా బాబు! వీళ్ళ ఏడుపు కథలన్నీ వినీ వినీ, వాటిని రికార్డుల్లో రాసీరాసీ, లైఫ్ మీదే విరక్తి వచ్చిందిరా! దీనికి తోడు ఉన్న ఆ ఒక్క గర్ల్ ఫ్రెండ్ సుధ, తనో పెద్ద మేధాపాట్కర్‌లా ఫీలవుతుంది. ఒక సరదాలేదు. సినిమా లేదు, కాసిన కబుర్లూ లేవు, ఒట్టి డెడ్‌వుడ్! కాసేపు బాల నివాస్ అంటుంది. కాసేపు ఓల్డ్ ఏజ్ హోమ్ అంటుంది. అసలే సోషల్ వర్క్‌తో మతిచెడిఉంటే, సినిమాల్లో కన్నాంబలాగా ఈవిడ! ఒక జీవితకాలం వేస్టయిపోయింది గురూ! ఈ సోషల్ వర్క్‌నూ, ఈ మేధాపాట్కర్‌నూ వదిలి ఎటైనా పారిపోతే బాగుండనిపిస్తుంది." అటువైపుగా వస్తున్న సుధను చూసి నిరంజనరావు వాక్ప్రవాహం ఆగిపోయింది.

"నిరంజన్! ఇక్కడ వీళ్ళతో ఈ సొల్లు కొట్టేకంటే వచ్చినాకు కాస్త హెల్ప్ చెయ్యొచ్చు కదా! ఆ శరణాలయం పిల్లలకు మేకప్ వేసి, డ్రస్సులు వేసి గంటనుండీ ఒక్కదాన్నే చస్తున్నాను. ఫైనల్ రిహార్సల్లో ఉన్నారు. అక్కడకు వెళ్ళు! నేను వెళ్ళి టీ, స్నాక్స్ ఏమైనా దొరుకుతాయేమో పట్టుకొస్తాను."అంటూ విసవిసా ముందుకు వెళ్ళింది సుధ. యస్ మేడమ్, అన్నట్లుగా రీడింగ్ రూమ్ వైపు వెళ్ళాడు నిరంజనరావు.

> "చావుకన్నా ప్రమాదకరమైనది భయం. అది మనలోపలి సుగుణాలనన్నిటిని తగలబెట్టే కాన్సర్. ఈ ప్రపంచంలో ఎంతో ఆనందం ఉంది. కోలాహలం ఉంది. అద్భుత సౌందర్యాలున్నాయి. స్నేహపు తీయదనాలు. ఆత్మీయతల హరివిల్లులూ, ఉన్నాయి. వీటన్నిటినుండి మనల్ని దూరం చేస్తుందీ భయం."

ఉన్నట్లుండి కోలాహలం, కేకలు ఆగిపోయి నిశ్శబ్దంగా అయిపోయింది వాతావరణం. "మోహినిరా! మోహిని!" ఆపుకోలేని ఎగ్జైటుమెంటుతో అరిచాడో జూనియర్ స్టూడెంటు. మోహిని క్లాస్ బ్యూటీ. జూనియర్ లతా మంగేష్కర్. "నగుమోముగనిలేని......" అంటూ శాస్త్రీయాన్ని, "దోజ్‌వర్‌దిడేస్ మై ఫ్రెండ్! ఉయ్ థాట్ దెనెవర్ ఎండ్!" అంటూ ఇంగ్లీషు పాటల్నీ మంత్రముగ్ధంగా పాడగల క్యాంపస్ కోకిల.

మోహినిని చూడగానే ఆనందశంకరంలో తత్తరపాటు, కలవరం కలిగాయి. మోహిని, ఆనందశంకరం స్వప్నాల్లో తీయగా మూలిగే మోహనరాగం. మోహినితో కొద్దిక్షణాలసేపు మాట్లాడగలగటం అనేది ఆనందశంకరానికున్న అతిముఖ్యమైన కోరిక.

"ఎటెన్షన్ ప్లీజ్!" అంటూ నిరంజనరావు మైకు దగ్గరకు వచ్చాడు. "ఏ ఉపన్యాసాలు, పార్మాలిటీలు లేకుండా పార్టీ జరపండని మన ప్రొఫెసర్‌గారు చెప్పారు. అందుకే ఇవాల్టి పార్టీలో ఉపన్యాసాలు లేవు. హితబోధలూ, ఉపదేశాలూ లేవు. ఓన్లీ ఫన్ అండ్ మ్యూజిక్. మోహిని పాటలు సరే. బాలనివాస్ పిల్లలతో సుధ రూపకల్పన చేసిన నృత్యనాటిక ప్రత్యేక ఆకర్షణ. ఇవాల్టి ఈ సాయంకాలం, ఈ కొలాహలం, ఈ మధురిమ సంవత్సరాల తరబడి మిమ్మల్ని వెంటాడాలని మా ఆకాంక్ష"

"కార్యక్రమాన్ని గౌరవనీయులైన వి.సి. గారి అతి చిన్న 'ఒక నిముషపు సందేశం'తో మొదలు పెట్టుకొందాము."

వి.సి రామమోహనరావు వేదిక పైకి వచ్చాడు. తెల్లని జుట్టు, కాంతులీనే కళ్ళు జ్ఞాన దీపం లా ఉన్నాడాయన.

"చావుకన్నా ప్రమాదకరమైనది భయం. అది మనలోపలి సుగుణాలనన్నిటిని తగలబెట్టే కాన్సర్. ఈ ప్రపంచంలో ఎంతో ఆనందం ఉంది. కోలాహలం ఉంది. అద్భుత సౌందర్యాలున్నాయి. స్నేహపు తీయదనాలు, ఆత్మీయతల హరివిల్లులూ, ఉన్నాయి. వీటన్నిటినుండి మనల్నీ దూరం చేస్తుందీ భయం. ఆకాశపుటంచుల్లో ఎగరాల్సిన గరుడపక్షుల్లాంటి యువకులు భయం ఆవహించి బుట్టక్రింద కోడిపెట్టల్లా ప్రవర్తిస్తున్నారు. మహోన్నతమైన శక్తి తమలో దాగి ఉందన్న విషయాన్ని మరిచిపోతున్నారు. నంగిరిపింగిరిగా, నస్మంతరపు వెధవల్లా బ్రతికేస్తున్నారు......" ఉలిక్కిపడ్డాడు ఆనంద శంకరం, వి.సి. మాటలకు తన గురించే చెబుతున్నాడా అనిపించింది. "ఈ భయం సంకెళ్ళను త్రెంచుకోగలిగితే ప్రపంచం మీ పాదల దగ్గరకు వస్తుంది!" ఆనందశంకరం గుండెలో మారు మ్రోగాయా మాటలు.

బాలనివాస్ పిల్లల 'బాలే' మొదలైంది. రిచర్డ్‌బాక్ రాసిన జూనాధన్ లివింగ్ స్టన్‌సీగల్ నవలకు నృత్యరూపం అది. పొట్టకూటికి కావలసిన కాసిని గింజలు సంపాదించుకుంటే చాలంటాయి అన్ని సముద్రపక్షులు (సీగల్స్) కాదు. ఆకాశపుటెత్తులు ఆవిష్కరించాలని, హరివిల్లులను తాకాలని, తిండి ఒక్కటే జీవితానికి పరమావధి కాదని వాదిస్తాడు జూనాధన్. జూనాధన్‌ను గుంపునుండి వెలివేస్తారు. నృత్యనాటికలో లీనమైపోయాడు ఆనందశంకరం. 'ముందుకు పోతాం మేము, ప్రపంచం మావెంట వస్తుంది! జూనాధన్ పాత్రవేసిన పాప అద్భుతంగా పాడుతుంది. "మీ ధైర్యపు రెక్కల్ని విప్పండి!"నాతోరండి!అద్భుతమైన అందాలెన్నిటినో మీకు చూపిస్తాను!' జూనా ధన్ పాడుతూనే ఉన్నాడు

"చాలా బాగుంది కదూ!" డాన్స్‌లో లీనమైన ఆనందశంకరం దగ్గరకు వచ్చింది విజయ. కంగారుగా లోపలికి ముడుచుకోబోయిన ఆనంద శంకరానికి "చావుకన్నా ప్రమాదకరమైనది భయం!" అన్న వి. సి మాటలు గుర్తుకొచ్చాయి. "ధైర్యపు రెక్కలు విప్పండి!" జోనాథన్ పాట చెవుల్లో మారుమ్రోగుతూ ఉంది. ముడుచుకుపోయిన హృదయకమలం మళ్ళీ విప్పుకొని ఆనందశంకరం ప్రేమగా విజయతో సంభాషించాడు. "ఆనందూ! ఆ జూనాడన్

చేసిన సాహసం లాంటిదేనేనూ చేశాను. ఈ రెండేళ్ళ సోషల్ వర్క్ కేరియర్‌లో బాలనివాస్ పిల్లలతో నాకో మరపురాని అనుబంధం ఏర్పడింది. వాళ్ళలోంచి ఒక పాపను ఎడాప్ట్ చేసుకోవాలని నా ఆశ. నందగోపాల్‌కి యిష్టం లేదు. అనాథ పిల్లలో, నేనో తేల్చుకో అంటున్నాడు. ఏం చెయ్యాలో తోచటం లేదు." దిగులుగా నిట్టూర్చింది విజయ. ఆనంద శంకరానికి ఏం చెప్పాలో తోచలేదు. అసలీ ప్రతిపాదనే వింతగా వుంది. ఒక స్నేహితురాల్ని కలవడానికి ధైర్యంలేక, అబద్ధాలు చెప్పి, దొంగలా ఎక్కడికో పారిపోయిన ఆనందశంకరానికి, ఇంత ఉన్నతంగా ఆలోచిస్తారా మనుషులు అనిపించింది. పొరలన్నీ తొలగి జీవితపు అసలు రూపం తనకి బహిర్గతమవుతున్నట్లుగా తోచింది ఆనంద శంకరానికి.

నృత్యనాటిక చివరి ఘట్టానికొచ్చింది మిగిలిన పక్షులన్నీ జూనాథన్‌ని అనుసరిస్తున్నాయి. నీలి మేఘాలవైపుకు, గాలికెరటాలవైపుకు ప్రయాణమయ్యాయి. సముద్ర పక్షులన్నీ, ఎంత గొప్ప సందేశం "ధైర్యపు రెక్కల్ని విప్పండి!" జూనాథన్ మాటలు చెవుల్లో మారుమ్రోగుతున్నాయి. బాలనివాస్ పిల్లల్ని అభినందిస్తూ చప్పట్లు మ్రోగుతున్నాయి. తన్మయత్వంలో ఉన్న ఆనందశంకరం చప్పట్లు కొట్టటమే మర్చిపొయ్యాడు.

మోహిని పాట మొదలైంది "నగ్మాలో, షేర్, సౌఘాత్ కిసేపేష్‌కరూ!" చప్పుడు చెయ్యకుండా జారిపడే మంచుతడిలాగా హాయిగా ఉందాపాట. పాట ముగిశాక చప్పట్లు, కేరింతలు. ఆనందం తట్టుకోలేక ఒక కుర్రవాడు "మోహినీ జిందాబాద్!" అన్నాడు. అందరూ 'జిందాబాద్! జిందాబాద్!' అన్నారు. సిగ్గుతో అదోలా తల వంచి సన్నని చిరునవ్వుల థ్యాంక్స్ చెప్పింది మోహిని. ఆనందశంకరానికి ఆపాట వింత హాయిని కలిగించింది. తన కలల్లో నివసించే మోహిని, ఆ వెన్నెల రాత్రిలో అలా యువరాణిలా మెరిసిపోతుంటే కించిత్ గర్వం కలిగి, ఊహల్లోనైనా ఈమె నేస్తాన్ని కాగలగాన్ అని తృప్తిపడ్డాడు.

మోహిని గురించిన అర్ణవంలో మునిగిపోయిన ఆనందశంకరానికి, "ఆనంద శంకరం పాట పాడాలి!" అంటూ మైకులో వినబడగానే, ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు నిరంజనరావు కొంటెగా, శాడిస్టిక్‌గా అతని వైపే చూస్తున్నాడు. ఆనందశంకరం నుండి ఏ ప్రతిస్పందన రాకపోయేసరికి పిల్లలందరూ "ఆనందశంకరం పాడాలి!పాడాలి!" అంటూ కోరస్‌గా అరవసాగారు.






ఆనందశంకరానికి తనకు చిరపరిచితమైన భయం రాక్షసి మళ్ళీ తనను ఆవహించినట్లుగా అనిపించింది. గుండెదడ ఊపిరి ఆడకపోవటం. రెండు మూడు సార్లు "చావు కన్నా ప్రమాదకరమైనది భయం" అంటూ తనలో తాను మంత్రోచ్చారణ చేసుకొన్నాడు. ఫలితంలేదు. జూనాథన్ సీగల్‌ను గుర్తు చేసుకున్నాడు. ఊహు! లాభం లేదు. కాళ్ళు కదలమని మొరాయిస్తున్నాయి.

వ్యక్తికి విచక్షణ, దయ ఉంటాయేమోగాని సమూహాలకు ఉండవు. సమూహాలు నంగిరిపింగిరి మాటల్ని, భయవికారాల్ని సహించవు.

ఒక కుర్రవాడు ఆనంద శంకరాన్ని ముందుకు త్రోశాడు. మరొకడు మైకు చేతికి ఇచ్చాడు. "ఆనంద శంకరం పాడాలి! పాడాలి!" రిథమిక్‌గా అరుస్తూనే వున్నారు.

అప్పుడు, ఏ పెను ధైర్యం ముందుకు తోస్తేనో ఏ తెగింపు సిగ్గు తెరల్ని చీల్చుకువస్తేనో ఆనంద శంకరం నోరు విప్పాడు. "ఈ విశాల, ప్రశాంత ఏకాంత సౌధమ్ములో...నిదురించుము జహాపనా! " ఎమ్.ఎస్. రామారావు పాట అది. ఆ పాట వచ్చునని ఆనంద శంకరానికే తెలియదు. చిన్నతనంలో హైస్కూలు తెలుగు మాష్టారు నేర్పించిన పాట అది. ఆ పాట రాగం లీలగా గుర్తుంది. అది సంవత్సరాల పొరల్ని చీల్చుకొని ఫ్రెష్‌గా బయటకు వచ్చింది. ఆ పాటలో ఆర్ద్రత వుంది. కన్నీటి తడి వుంది. గుండెను పిండివేసే దిగులు ఉంది. ఆనంద శంకరం పాట మంచి గంధపు పరిమళంలా అక్కడంతా వ్యాపించింది. కన్నీటితో

తడిసిన గులాబీపూవొకటి దోసిళ్ళలో జారి పడ్డట్టుగా ఫీలయ్యారు శ్రోతలు.

పాట ముగిసినాక చప్పట్లే చప్పట్లు. ఆనందాన్ని ఆమోదాన్ని తెలియజేయడానికి మనిషికున్న అతి సులువైన సాధనం చప్పట్లు. రెండు నిముషాలపాటు సుదీర్ఘమైన చప్పట్లతో ఆ పాట తమకెంత నచ్చిందో తెలియజేశారు, శ్రోతలు.

ఆనందశంకరం ఉక్కిరి బిక్కిరి అయినాడు. సిగ్గుతో, కళ్ళు తుడుచుకుంటూ 'థ్యాంక్స్' అన్నాడు. అంతట్లోనే జరిగిందొక అద్భుతం. మోహిని మాంత్రికుని ఇంద్రజాలంలో చిక్కుకున్న గంధర్వ కాంతలా బరువునడకలతో అతన్ని సమీపించి "ఎంత గొప్పగా పాడారు. మనసు ఆల్బమ్‌లో పదిలంగా దాచుకోవాల్సిన జ్ఞాపకం ఈ పాట. ఈ చిన్న కాంప్లిమెంటు తీసుకోండి!" అంటూ ఆనంద శంకరం బుగ్గపై చప్పుడు చెయ్యని ముద్దును సుతారంగా అందించింది.

రాత్రి పది గంటలు దాటి ఉంటుంది. అంతటా మిలమిలలాడే వెన్నెల. చెట్ల గుబుర్లలో మత్తిలిన పక్షులు ఉండీ, ఉండీ కుహూ కుహూ మంటున్నాయి. చిప్పిలిన కళ్ళతో ఆనందశంకరం నలువైపులా చూశాడు. రెక్కలు విప్పి ఎగరడానికి సిద్ధంగా ఉన్న జూనాథన్ సీగల్స్‌లా ఉన్న యువతీయువకులు. ఇప్పుడు వాళ్ళను చూస్తే ఆనంద శంకరానికి భయంవేయుటం లేదు. మనిషికీ మనిషికీ మధ్యనున్న దగ్గరితనం ఏమిటో అర్థం అవుతుంది. చూస్తుండగానే పార్టీ అంతటా ఆనంద శంకరమే అయ్యాడు. ఏళ్ళ తరబడి ముడుచుకుపోయిన రెక్కలేవో విచ్చుకున్నట్లుగా అనిపించసాగింది ఆనంద శంకరానికి.

"హలో అంకుల్! చాలాబాగా పాడారు!" జూనాథన్ సీగల్‌గా వేసిన పాప. ఆ పాపను చూడగానే ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు. "నాదేముంది, గాలి పాటలు. ఇందాకటి నీ నాట్యం ఇంకా నా కళ్ళలోనే మెదులుతుంది. ఇంత చిన్న వయసులోనే ఎంతటి ప్రతిభ!" ప్రశంసగా తనను ఎత్తుకొని ముద్దు పెట్టుకొన్నాడు. ఇద్దరూ చేతిలో చేయివేసుకొని ఆప్తమిత్రుల్లా పార్టీ అంతటా తిరిగారు.

రీడింగ్ రూమ్‌కు కుడివైపున ఉన్న క్రోటన్స్ గుబురు దగ్గర విజయ, నందగోపాల్ కనబడ్డారు. ఇద్దరు ఏదో గొడవ పడుతున్నట్లుగా ఉన్నారు. ఉబికి వస్తున్న కన్నీళ్ళు ఆపుకుంటూ, పైటచెంగుతో కళ్ళు వత్తుకొంటుంది విజయ. మామూలుగా అయితే అలాంటి సన్నివేశాలు తటస్థపడితే హడావుడిగా అక్కడి నుండి పారిపోతాడు. ఇవాళ్ల పరిస్థితి వేరు. ఉత్సాహాలు రెక్కలు విప్పిన జూనాథన్ ఆనంద శంకరం ఇతను.

"ఏరా గోపాల్!ఇలాంటి సమయాల్లోనా మీ పోట్లాట?" అన్నాడు మందలింపుగా. "పోట్లాట కాకపోతే ఏమిటిరా! ఈవిడో పెద్ద మదర్ థెరిస్సాలా అనాథ పిల్లల్నందర్నీ ఉద్ధరిస్తానంటుంది. ప్రాక్టికల్‌గా ఆలోచించవద్దూ! ఎడాప్టు చేసుకోగానే సరా. ఇట్లాంటి ఆదర్శాలకు పోతే చేతులు కాలతాయి. నువ్వయినా చెప్పరా ఆనందూ! అసలు మేమిద్దరం పెళ్ళి చేసుకోవటమే పెద్ద ఎడ్వెంచరు. పైగా ఇదొకటా!"

ఏం చెప్పాలో తోచలేదు ఆనంద శంకరానికి. మౌనంగా అక్కడినుండి కదలి వచ్చాడు. చదువు వేరు. జీవితం వేరు. సిద్ధాంతాలు వల్లించటం వేరు. ఆచరణ వేరు. ఆనందశంకరానికి తన పిరికితనం, తన వెసులుబాటు, నందగోపాల్ మార్కు ప్రాక్టికాలిటీ అన్నీ ఒక మూసలోనివే అనిపించింది.

వేదికపైన సుధ నిరంజనల పాడుతున్న యుగళగీతం మంద్రంగా హాయిగా వినిపించసాగింది. ఆకాశంలో ఏకాంతపు మబ్బు ఒకటి హడావుడిగా ఎటో వెళుతుంది. టిర్విటో....టిర్విటో..... పక్షి ఒకటి కలలోంచి హఠాత్తుగా మేలుకొన్నట్లుగా ఉలికిపాటులాంటి అరుపు అరుస్తుంది.

ఆనంద శంకరం వణుకుతున్న చేతులతో జూనాథన్ పాప చేతిని పట్టుకొన్నాడు బలంగా, గట్టిగా.

ఒక ప్రయత్నం, ఒక పెనుగులాట, ఒక నిశ్చలనిర్వృతం ఆ స్పర్శతో తోచాయా అనాథ బాలికకు.

